క్లుప్తంగా

ఏవీఎన్ రెడ్డిని కలిసిన నాయకులు



ధరూరు: హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి విజయం సాధించడంతో శుక్రవారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్య నిర్వాహకులు ఓతూరి నరేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి కలిశారు. హైదరాబాద్‌లో ఏవీఎన్ రెడ్డిని కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జోగులాంబ గద్వాల జిల్లా నాయకులు రత్నాకర్, జగన్‌మోహన్‌రెడ్డి, నాగరాజు, మహేందర్, వెంకటేష్, రవి, మోహన్, రాము, సమరసింహారెడ్డి తదితరులు

సైబర్ నేరాలపై అవగాహన

ఉండవెల్లి: ప్రతిఒక్కరూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసు కళాజాతా బృందం సభ్యులు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఇటిక్యాలపాడులో ప్రజలకు సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాజాతా బృందం సభ్యులు మాట్లాడుతూ ఎవరైనా ఆన్‌లైన్ మోసాలకు పాల్పడితే 1930 నంబర్‌కు డయల్ చేయాలని కోరారు. అమ్మాయిలతో, మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు హనుమంతు, రాంరెడ్డి, శేషన్న, కృష్ణ, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం

గద్వాల అర్బన్: ప్రభుత్వ వసతిగృహాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు మాచర్ల ప్రకాష్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ షెడ్యూల్ కులాల సాంఘిక సంక్షేమ బాలుర కళాశాల వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. వసతి గృహంలో కిటికీలు, మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

అయిజ: మండలంలోని సంకాపురంలో 7వ వార్డు మెంబర్ మాణిక్యమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం రాత్రి మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అబ్రహం శుక్రవారం గ్రామానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు.

వాహనాల వేలం

గద్వాల క్రైం: వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు శుక్రవారం ఎక్సైజ్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఈఎస్ సైదులు ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. వేలం ద్వారా రూ.11, 92,070 ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. వేలంపాటను పారదర్శకంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ వేలంలో సీఐలు గోపాల్, బానోత్ పటేల్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

మిర్చి రైతుకు సన్మానం

అయిజ: మండలంలోని ఎక్లాస్‌పురం గ్రామానికి చెందిన రైతు సామేలును మిర్చి మార్కెట్ ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. కర్నాటక రాష్ట్రం బ్యాడిగి మిర్చికి మార్కెట్‌లో క్వింటా రూ. 54,199 ధర పలికింది. ఈ సందర్భంగా రైతును సన్మానించారు.

నర్సరీల నిర్వహణపై అలసత్వం వీడాలి



అమరచింత: గ్రామాల్లోని నర్సరీల నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు అలసత్వం వీడాలని.. మొక్కలు ఎదిగేలా చర్యలు తీసుకోవాలని డీపీఓ సురేష్‌కుమార్ అన్నారు. చెట్టు చెట్టుకు నీరు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని ఈర్లదిన్నె, కిష్టంపల్లి, మస్తీపురంలోని నర్సరీలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిని దృష్టిలో ఉంచుకొని మొక్కలకు నిత్యం నీటిని అందించాలని, మొలకెత్తని విత్తన సంచులను గుర్తించి కొత్త విత్తనాలు నాటాలని సూచించారు. ఆయా గ్రామాల్లో నాటిన హరిత మొక్కల సంరక్షణపై సర్పంచ్‌లు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.

కంటి పరీక్షలు తప్పనిసరి..

గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటుచేసి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు నిర్వహిస్తున్నామని డీపీఓ సురేష్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఈర్లదిన్నెలో కొనసాగుతున్న కంటివెలుగు శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కంటి వెలుగును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ చుక్క లక్ష్మమ్మ, ఎంపీడీఓ జ్యోతి, ఎంపీఓ నర్సింహులు, ఏపీఓ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు



ధరూరులో రాయచూరు రహదారి పక్కన ప్రమాదభరితంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు

ధరూరు: విద్యుత్ ప్రమాదాలు ఎన్ని జరుగుతున్నా అధికారుల్లో మాత్రం చలనం లేదు. రోడ్డు పక్కన కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటుచేసి చేతులు దులుపుకుంటున్నారు. మండలంలో వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదభరితంగా దర్శనమిస్తున్నాయి. రహదారికి సమీపంలో ఏర్పాటుచేయడంతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వాహనదారులు ప్రయాణిస్తున్నారు. రోడ్లు, పాఠశాలలు, ముఖ్య కూడళ్ల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లతో ప్రమాదం పొంచి ఉంది. విద్యుత్ వినియోగదారులతో ముక్కుపిండి బిల్లులు వసూలు చేయడంలో ఉన్న శ్రద్ధ ప్రజల ప్రాణాలకు కాపాడుటలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఇదీ పరిస్థితి...

మండల కేంద్రంలో గద్వాల– రాయచూరు రహదారిని ఆనుకుని ఉన్న ప్రధాన విద్యుత్ లైన్‌తో పాటు మూడు ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. వీటి ముందే ఉన్నత పాఠశాల ఉండడంతో విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉంది. స్థానిక రైస్‌మిల్ వద్ద ఉన్న రోడ్డుకు దగ్గర ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేశారు. ఉప్పేరు పునరావాస కేంద్రంలో ఏర్పాటు చేసిన సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి.

పట్టించుకోని అధికారులు

మండలంలోని ద్యాగదొడ్డిలో ఇళ్ల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌తో ఏడాదిన్నర కిందట ఓ ఆవు విద్యుత్‌షాక్‌కు గురైంది. ఎర్తులు సరిగా లేకపోవడంతో తరచూ ఇళ్లల్లో షార్ట్‌సర్క్యూట్ ఏర్పడి విలువైన వస్తువులు కాలిపోతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. నాలుగు రోజుల కిందట ధరూరు, అల్వలపాడు గ్రామాల్లో పాత విద్యుత్ లైన్‌లు పెనవేసుకుని మంటలు చెలరేగి ఇళ్లల్లో గృహోపకరణలు కాలిపోయాయి.

కంచె ఏర్పాటు చేయాలి



ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఎర్త్ కనెక్షన్‌తో పాటు కంచె ఏర్పాటు చేయాలి. మూగజీవాలు ప్రమాదాలబారిన పడుతున్నాయి. ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించాలి.

– పొంటన్న, ధరూరు

మీటర్లు కాలిపోతున్నాయి



విద్యుత్ సరఫరాలో హెచ్చు, తగ్గులతో గృహోపకరణాలు కాలిపోతున్నాయి. ఎర్తలను సరిచేయాలి. రోడ్డు పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు సరికాదు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– తిమ్మన్న, ధరూరు

ప్రతిపాదనలు పంపించాం

మండలంలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచెను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు అయిన వెంటనే పనులు చేపడతాం. త్వరలోనే నిధులు వచ్చే అవకాశం ఉంది. ఎక్కడ సమస్య వచ్చినా వెంటనే స్పందించి చర్యలు తీసుకుంటున్నాం. మూగజీవాల రక్షణ కోసం కంచెను ఏర్పాటు చేస్తాం.

– నాగరాజు, ఏఈ

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు



మానవపాడులో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా నోడల్ అధికారి హృదయరాజ్

మానవపాడు: మండలంలోని గంగు వెంకటకృష్ణరెడ్డి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం ఆంగ్లం పరీక్షను శుక్రవారం పకడ్బందీగా నిర్వహించామని జిల్లా నోడల్ అధికారి హృదయరాజ్ తెలిపారు. 117 మంది విద్యార్థులకు 114 మంది హాజరయ్యారని, ముగ్గురు గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ బందోబస్త్ నిర్వహించారు. కార్యక్రమంలో చీఫ్ ఎగ్జామినర్ పద్మావతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ధరూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు ఇంగ్లిష్ పరీక్షలను రాశారు. మొత్తం 304 మంది విద్యార్థులకు 297 మంది హాజరయ్యారు. ఏడుగురు గైర్హాజరు అయినట్లు చీఫ్ సూపరింటెండెంట్ కృష్ణ తెలిపారు. ఒకేషనల్‌కు సంబంధించి మొత్తం 10 మంది విద్యార్థులకు 10 మంది హాజరయ్యారు. డిపార్ట్‌మెంటల్ అధికారిగా భాగ్యలక్ష్మీ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు.

విద్యార్థికి అభినందన

ఉండవెల్లి: మండలంలోని బొంకురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి రఫిక్ అహ్మద్ ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా శుక్రవారం ఉపాధ్యాయులు రఫిక్‌ను అభినందించారు. విద్యార్థికి ప్రతి ఏడాది రూ.12,000 వేల స్కాలర్‌షిప్ నాలుగేళ్ల పాటు వస్తుందని ఉపాధ్యాయులు తెలిపారు.

17ఎఎల్‌పి708 బొంకూరు పాఠశాలలో విద్యార్థి రఫిక్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కమిషనర్‌కు వినతి



అలంపూర్: రెండు నెలల కిందట ప్రారంభించిన అంతర్గత డ్రెయినేజీ పనులను వెంటనే పూర్తి చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ నిత్యానంద్‌ను మూడో వార్డు ప్రజలు కోరారు. శుక్రవారం కాలనీవాసులు కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. డ్రెయినేజీ పనులు అసంపూర్తిగా వదిలేయడంతో ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. కాలువలో ప్లాస్టిక్ కవర్లు, ఇటుకలు అడ్డురావడంతో ఇటీవల కురిసిన వర్షం నీరు రోడ్లపై ప్రవహిస్తోందని వాపోయారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని కాలనీవాసులు విన్నవించారు.

కనులపండువగా రథోత్సవం



అమరవాయి చింతలాముని నల్లారెడ్డిస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మల్దకల్: మండలంలోని అమరవాయి చింతలాముని, నల్లారెడ్డిస్వామి వార్ల రథోత్సవాన్ని శుక్రవారం రాత్రి కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ మూర్తులను భాజాభజంత్రీలతో వేదపండితులు రథంపై ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం నుంచి గ్రామంలోని వీరభద్రస్వామి ఆలయం వరకు ఊరేగించారు. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. ఈ సందర్భంగా స్వామివార్ల నామస్మరణ మార్మోగింది. రథోత్సవం తిలకించేందుకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గోపాల్ రెడ్డి, నిర్వాహకులు చంద్రశేఖర్‌రెడ్డి, సత్యానారాయణ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విక్రంసింహారెడ్డి, పాండురంగారెడ్డి, రాధాకృష్ణారెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, కృష్ణారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, లక్ష్మన్న, నల్లన్న, పూజారులు పెద్దనల్లన్న, చిన్ననల్లన్న, పాండురంగయ్య, ప్రభాకర్, రంగస్వామి, నల్లన్నలు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబపాలనను సాగనంపుదాం



మాట్లాడుతున్న ఆకునూరు మురళి

గట్టు: రాష్ట్రంలో, గద్వాలలో కుటుంబ పాలనకు చమరగీతం పాడుదామని ఎస్‌డీఎఫ్ కన్వీనర్, మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి కోరారు. శుక్రవారం నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ బోయలగూడెం నుంచి పాదయాత్రను ప్రారంభించారు. ఆకునూరు మురళి, ఎస్‌డీఎఫ్ కో కన్వీనర్ సంగంరెడ్డి పృథ్వీరాజ్‌యాదవ్‌లు పాదయాత్రలో పాల్గొని మద్దతు తెలిపారు. బోయలగూడెం, ఇందువాసి, చిన్నోనిపల్లె, చాగదోన, మిట్టదొడ్డి వరకు పాదయాత్ర కొనసాగింది. బోయలగూడెం లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మురళి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలను ఏకంగా చేస్తూ, చైతన్యం చేస్తూ, ప్రశ్నించే గొంతుక రంజిత్‌కుమార్ అని కొనియాడారు. కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు బుచ్చిబాబు, రంగస్వామి, పరుషరాముడు, ఆవనిశ్రీ, బలరాం, దయాకర్, నరేష్ గొవిందు, మునెప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

అయిజ: మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం ఉదయం 10:30 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సాయిప్రకాష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

గర్భిణులకు పండ్లు పంపిణీ



అయిజ: మాజీ కేంద్ర మంత్రి బంగారు లక్ష్మణ్ జయంతి సందర్భంగా శుక్రవారం పట్టణంలోని పీహెచ్‌సీలో గర్భిణులకు, బాలింతలకు బీజేపీ నాయకులు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యులు మాదన్న, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మేకల అంజనేయులు, జిల్లా వాణిజ్య సెల్ కన్వీనర్ ప్రతాప్ గౌడ్, భీబన్న, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ విజయోత్సవం



గద్వాలలో సంబరాలు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

గద్వాల: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో బీజేపీ బలపరిచిన అభ్యర్థి ఏవీఎన్‌రెడ్డి గెలుపొందారు. ఈ సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలో బీజేపీ నాయకులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ప్రధాన చౌరస్తాలలో పటాకులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. మిఠాయిలు పంపిణీ చేశారు. ఒకరికొకరు రంగులు చల్లుకుని సంతోషం వ్యక్తం చేశారు. అదేవిధంగా స్థానిక డీకే బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో అవినీతి పాలనతో ప్రజలు విసిగిపోయారని, మోదీ నాయకత్వంలోని పారదర్శకమైన బీజేపీ పాలన కోరుకుంటున్నారని దీనికి ఎమ్మెల్సీ ఫలితాలే నిదర్శనమన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రజక జయశ్రీ, బండల వెంకట్రాములు, రవికుమార్, వెంకటేశ్వర్ రెడ్డి, యల్లప్ప, భాస్కర్‌యాదవ్, నర్సింహా, అనిల్, జగదీష్, ఆనంద్, శ్యామ్, సత్యం, నల్లారెడ్డి, సురేష్, గీతారెడ్డి, ప్రవీణ్, రంజిత్, మోహన్ పాల్గొన్నారు.

అలంపూర్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏవీఎన్ రెడ్డి విజయం సాధించడంతో అలంపూర్ చౌరస్తాలో బీజేపీ నాయకులు పటాకులు కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో తెలంగాణ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు మనోహర్ రెడ్డి, రాజగోపాల్, వెంకటేష్, సంజీవరెడ్డి, నరసింహా, పాల్గొన్నారు.

అయిజ: ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థి ఏవీన్ రెడ్డి గెలుపుపై శుక్రవారం పట్టణంలో బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పటాకులు కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యులు మాదన్న, మెడికల్ తిరుమలరెడ్డి, భీమేశ్వర్‌రెడ్డి, నాగరాజు, రామన్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ధరూరు: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి గెలుపును హర్షిస్తూ బీజేపీ నాయకుల సంబరాలు చేసుకున్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తాలో పటాకాలు కాల్చి స్వీట్లు పంచుకుని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాజేష్, జిల్లా ఉపాధ్యక్షుడు కిష్టన్న, సంజీవ్ భరద్వాజ్, వెంకటేశ్వరరెడ్డి, అంజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శాంతినగర్: ఏవీఎన్‌రెడ్డి గెలుపుపై వడ్డేపల్లి మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు రామకృష్ణనాయుడు ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో పటాకులు కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షుడు అయ్యారాజు, మోహన్‌యాదవ్, రామ్, పరుషరాముడు, కాశీనాథ్ నాయుడు, జగదీష్, తిరుమలేష్, శివాజీ, వెంకటేష్, అంజిలు పాల్గొన్నారు.

న్యాయవాది కుటుంబసభ్యులకు పరామర్శ

శాంతినగర్: ఇటీవల అనారోగ్యంతో న్యాయవాది లక్ష్మణ్‌ప్రసాద్ మృతి చెందారు. శుక్రవారం ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి పట్టణంలోని బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. అదేవిధంగా అనారోగ్యంతో బాధపడుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థలదాత బసవపూర్ణయ్యను ఆయన పరామర్శించారు. ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. రవీంద్ర పాఠశాల మైదానంలో జూనియర్ కళాశాలకు అవసరమయ్యే స్థలాన్ని ఇస్తామని, కళాశాల మంజూరు చేయించాలని ఎమ్మెల్సీని మహిపాల్‌రెడ్డి, భార్గవ్‌యాదవ్, బసవపూర్ణయ్య కోరారు. అనంతరం శాంతినగర్ భవానీ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన వావిలాల కృష్ణారెడ్డి కూతుర్తె వివాహానికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. ఎమ్మెల్సీ వెంట మున్సిపల్ చైర్మన్ కరుణ, హరినాథ్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, రంగారెడ్డి, తోట రవి, తోట మధు, సర్వేశ్వర్‌రెడ్డి, పుల్లారెడ్డి, వెంకట్రామిరెడ్డి, మాబిరెడ్డి, లోకేశ్వర్‌రెడ్డి, గంగిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మాణిక్యరెడ్డి, భాస్కర్‌రెడ్డి, కార్యకర్తలు ఉన్నారు.

తాగునీరు కలుషితం

ఆత్మకూర్: పట్టణానికే కాకుండా ఉమ్మడి జిల్లాకే తాగునీటిని అందిస్తున్న రామన్‌పాడ్ ప్రాజెక్టు వద్ద కాల్వలో పందుల మృత కళేబరాలు ఉండటంతో నీరు కలుషితం అవుతుందని పట్టణ ప్రజలు తెలిపారు. జూరాల ప్రాజెక్టు నుంచి ఎడమ కాల్వ ద్వారా తాగునీరు రామన్‌పాడ్ రిజర్వాయర్‌కు నిత్యం సరఫరా అవుతుంది. దీంతో ఎక్కడి నుంచో కొట్టుకొచ్చిన జంతువుల మృత కళేబరాలు రామన్‌పాడ్ జలాశయం కాల్వ గేట్ల వద్ద నిల్వ ఉండటంతో తాగునీరు కలుషితం అవెతుంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బీఎస్పీ నాయకుల రాస్తారోకో



అలంపూర్ చౌరస్తాలో బీఎస్పీ నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు



ఇటిక్యాల మండల కేంద్రంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

అలంపూర్: రాష్ట్రంలోని నిరుద్యోగ యువత భవిష్యత్తును ప్రభుత్వం నాశనం చేసిందని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, నియోజకవర్గ అధ్యక్షుడు మహేష్ ఆరోపించారు. అలంపూర్ చౌరస్తాలోని నాలుగు రోడ్ల కూడలిలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అరెస్టును నిరసిస్తూ ఆ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ట్రాఫిక్ అంతరాయం కలగడంతో ఆందోళన విరమించాలని పోలీసులు కోరారు. ఎంతకీ వినకపోవడంతో ఉండవెల్లి ఏఎస్ఐ అయ్యన్న ఆధ్వర్యంలో నాయకులను అరెస్ట్ చేశారు. అనంతరం బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ అధ్యక్షుడు మాట్లాడుతూ 30 లక్షల మంది యువత భవిష్యత్తును ప్రభుత్వం నాశనం చేసిందన్నారు. వేలాది మంది బిడ్డల కోసం పోరాటం చేస్తే అరెస్టులు చేయడం ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనమన్నారు. పేపర్ లీకేజీకి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎంజీ కృష్ణ, మణికుమార్, రాంబాబు, రాజు, సురేష్, రవిచందర్, ఆయా మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ నిందితులను వెంటనే అరెస్టు చేయాలని బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు మణికుమార్ అన్నారు. శుక్రవారం నిరుద్యోగులకు న్యాయం చేయడం కోసం బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ చేపట్టిన నిరాహార దీక్షను భగ్నం చేసి పోలీసులు హౌస్ అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ఇటిక్యాల మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో టిఎస్‌పీఎస్సీ పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాంబాబు, బీఎస్పీ శ్రేణులు, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం



సమస్యలు తెలుసుకుంటున్న సంపత్‌కుమార్

శాంతినగర్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ అన్నారు. శుక్రవారం హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా వడ్డేపల్లి మండలంలోని కొంకల, వెంకట్రామనగర్, జూలెకల్ స్టేజీలో కొనసాగింది. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ ఇంటింటికి తిరుగుతూ ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతుల పంటలకు గిట్టుబాటు ధర, పెట్టుబడికి ఎకరాకు రూ.15 వేలు, ఇందిరమ్మ ఇంటికి రూ.5 లక్షల ఆర్థికసాయం అందజేస్తామన్నారు. కొంకలకు చెందిన కృష్ణారెడ్డి కుమారుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా బాధితుడిని పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రామకృష్ణారెడ్డి, పచ్చర్ల కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీ



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ నాగరాణి

మల్దకల్: గర్భిణీ, బాలింతలకు పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలని సూపర్‌వైజర్ నాగరాణి అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. శుక్రవారం మండలంలోని బిజ్వారం అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా అంగన్‌వాడీ కేంద్రాలలో గర్భిణీ, బాలింతలు చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం పంపిణీకి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఎత్తు, బరువు తక్కువగా ఉన్న చిన్నారుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె పేర్కొన్నారు. గర్భిణులు నెలనెలా వైద్యపరీక్షలు చేయించుకోవడంతో పాటు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు వరలక్ష్మి, అనంతమ్మ, పార్వతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



పెంచికలపాడులో..



మల్దకల్ మండలం ఎల్కూరులో..

అలంపూర్ రూరల్: మండలంలో శుక్రవారం కంటి వెలుగు కార్యక్రమం కొనసాగింది. క్యాతూర్ పీహెచ్‌సీలోని భీమవరంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరంలో 76 మంది పురుషులు, 57 మంది మహిళలు మొత్తం 133 మంది పరీక్షలు చేయించుకున్నారు.

మల్దకల్: మండలంలోని ఎల్కూరులో శుక్రవారం కంటి వెలుగును ఎంపీడీఓ కృష్ణయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందికి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ నవీన్‌కుమార్, స్వరూపరాణి, సర్పంచ్ రాధ, నాయకులు చక్రాధర్‌రెడ్డి, హైదర్‌సాబ్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గట్టు: మండలంలోని పెంచికలపాడు, బోయలగూడెం గ్రామాల్లో కంటి వైద్య శిబిరం శుక్రవారం కొనసాగింది. రెండు గ్రామాల్లో మొత్తం 306 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 12 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. 26 మందికి కంటి అద్దాల కోసం ప్రతిపాదనలు పంపినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు తిమ్మప్ప, నరేష్, సూపర్‌వైజర్లు మక్బూద్, తాహెరా, సాలమ్మ, ఈశ్వరమ్మ, పాల్గొన్నారు.

నేడు దుకాణాల వేలం పాట



పేర్లు నమోదు చేసుకుంటున్న గ్రామస్తులు

గట్టు: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో ఇటీవల నూతనంగా నిర్మించిన దుకాణాలకు వేలంపాటకు పంచాయతీ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. శుక్రవారం గ్రామ పంచాయతీ వేలంపాటకు హాజరయ్యే ఔత్సాహికుల నుంచి ఇంటి పన్ను, వేలానికి సంబంధించిన ఫీజును పంచాయతీ కార్యదర్శి జగన్నాథరావు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ రెండు చిన్న, ఏడు పెద్ద దుకాణాలకు వేలం వెయ్యనునట్లు తెలిపారు. పెద్ద దుకాణాలకు రూ.50 వేలు, చిన్న దుకాణాలకు రూ.40 వేలు డిపాజిట్ నిర్ణయించినట్లు పేర్కొన్నారు. శనివారం దుకాణాలకు వేలం పాట నిర్వహిస్తునట్లు అందరూ సకాలంలో హాజరు కావాలని కోరారు. అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆయన వివరించారు.